
# సాక్షి ఒడిశా

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.99.812లు, బంగారం 100మిల్లీగ్రాములు, వెండి 10 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



**అట్టహాసంగా ఆరాధనోత్సవాలు**

- 8లో.



**జీవాలకు అవాసం**

జయపురం: పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న జీవాలను గోశాలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేశారు. అక్కడే జీవాలకు పోషణ, ఆవాసానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు.

## న్యూస్‌రీల్

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న బాధితులు

రయగడ: జిల్లాలోని టికిరి పోలీస్ స్టేషన్ పరిధి డెంగాగుడ గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులు పానొబొందో గ్రామానికి చెందిన సబన్ మాఝి(22), టిటు మాఝి(25), కలియాకోన గ్రామానికి చెందిన తపన్ మాఝి(27)గా పోలీసులు గుర్తించారు. ఉదయం టికిరి నుంచి తొటాగుడ గ్రామానికి బైకుపై ముగ్గురూ ప్రయాణిస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన లారీని అదుపుతప్పి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాధితులను అంబులెన్స్‌లో టికిరి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

### రూ.6.30 లక్షల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో నిందితులు

రాయగడ: జిల్లాలోని గుడారి పోలీసులు జయపంగ కూడలిలో శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో స్కూటీ, మరో 3 వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 63.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాలను గుడారి ఐఐసీ దీనబంధు సాబోరో ఆదివారం వెల్లడించారు. అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు జయపంగ కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుడారి నుంచి మునిగుడ వైపు వెళ్తున్న వాహనాల్లో రూ.6.30 లక్షల విలువైన గంజాయి పట్టుబడిందని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేశామని, సోమవారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

### కరోనా వారియర్ కుటుంబానికి ఆర్థికసాయం



నికోలస్ భార్యకు చెక్కు అందిస్తున్న అదనపు కలెక్టర్

జయపురం: స్థానిక పట్టణంలోని కోవిడ్ హాస్పిటల్‌లో కరోనా రోగులకు ఎన్నో సేవలందించిన నికోలస్ బెనియా తానూ అదే వ్యాధికి గురై ప్రాణాలు కోల్పోయాడు. 2021 మే 14న ఈ ఘటన జరగ్గా.. అతని భార్య సబితా లీమా, కుటుంబ సభ్యులు ఆర్థికసాయం కోసం సీఎం నవీన్ పట్నాయక్‌కు విన్నవించారు. బెనియా కోవిడ్ రోగులకు సేవలందించే క్రమంలో మరణించాడని, అప్పటి నుంచి కరోనా యోధునిగా గుర్తించాలని తోటి ఉద్యోగులు సైతం అధికారులను డిమాండ్ చేశారు. అయినా ప్రభుత్వం స్పందించక పోవడంతో ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో స్పందించిన కొరాపుట్ కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఎట్టకేలకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పందన రాగా, 22నెలల అనంతరం నికోలస్ బెనియాను కోవిడ్ యోధునిగా ప్రకటించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థికసాయం ప్రకటించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆయన భార్య సబితకు జిల్లా అదనపు కలెక్టర్ రాజేంద్ర మాఝి సమక్షంలో అందేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుశాంతకుమార్ దాస్, జిల్లా ఎమర్జెన్సీ అధికారి రంజిత్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.





వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులు

# మేళా.. ఫలప్రదం

- వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు ఆసక్తి చూపిన రైతులు
- కిసాన్ మేళాలో రూ.19 కోట్ల 43 లక్షల సామగ్రి విక్రయాలు
- యాంత్రీకరణ వైపు అడుగులు వేయడంపై అధికారుల హర్షం

జయపురం: వ్యవసాయంలో పాత విధానాలను అనుసరిస్తున్న కొరాపుట్ జిల్లా రైతులపై జయపురంలో 5 రోజులుగా నిర్వహిస్తున్న దక్షిణ ఒడిశా కిసాన్ మేళా–2023 ప్రభావం చూపింది. ఇందులో జిల్లాకు చెందిన రైతులు రూ.19 కోట్ల 42 లక్షల 95 వేల విలువైన యంత్ర సామగ్రిని కొనుగోలు చేశారని వ్యవసాయ శాఖ ఇంజినీర్ మానస్ పండి ఆదివారం వెల్లడించారు. ఆశించిన కంటే ఎక్కువ సంఖ్యలో రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు యంత్రాలకు కోసం ఆర్డర్లు చేశారన్నారు. సబ్సిడీపై ట్రాక్టర్లు అందిస్తామని చెప్పినా గతంలో ఎవరూ ముందుకు వచ్చేవారు కాదని, మేళాలో 24 ట్రాక్టర్లు అమ్మకాలు జరిగాయని తెలిపారు. పవర్ టిల్లర్లు 205, స్పెషల్ పవర్ వీడర్లు 407, పంపుసెట్లు 73 విక్రయించామని ప్రకటించారు. 59 మినీ రైస్ మిల్లులు, 2మినీ ఆయిల్ మిల్లులు, 2మినీ పప్పు మిల్లులు, 10 మొక్కజొన్న సెల్లర్లు, 69స్పెషల్ పవర్ మల్టీక్రాప్ త్రెజర్లకు ఆర్డర్లు వచ్చాయన్నారు.

**మార్పుకు నాంది..**

జిల్లాలో 14 ఆగ్రో సర్వీస్ కేంద్రాల ఏర్పాటుకు రైతులు దరఖాస్తు చేశారని, వీటికి రూ.6 కోట్లకు పైగా ఖర్చవుతుందని మానస్ పండి తెలిపారు. అలాగే అనేక వ్యవసాయ వినియోగ యంత్రాల కోడం రైతులు ముందుకు రావడంతో తాము ఆశించిన లక్ష్యం నేరవేరినట్లు భావిస్తున్నామన్నారు. యంత్రాలతో వ్యవసాయం చేయడం వల్ల ఉత్పత్తి ఎక్కువ వస్తుందని పేర్కొన్నారు. అలాగే 12మంది రైతులు డైరీ యూనిట్లు పెట్టేందుకు ముందుకు వచ్చారని, పలు గ్రామాలలో గోదాములు ఏర్పాటు, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు, మేకల పెంపకం, వ్యవసాయ అనుబంధ విభాగాలను నెలకొల్పేందుకు పలువురు ఆసక్తి చూపారన్నారు. పెద్దఎత్తున వ్యవసాయ యంత్రాలు కొనుగోలు, సంబంధత పరిశ్రమల స్థాపనకు రైతులు ముందుకు రావడం మార్పుకు నాందిగా భావిస్తున్నామని వివరించారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు..**

జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత 5 రోజులుగా జరుగుతున్న దక్షిణ ఒడిశా కృషి మంత్ర మేళా ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జయపురం అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి, జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబినాయక్ ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఒడిశా కళా సంస్కృతులపై ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాహిణీపతి, నాయక్



ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న కళాకారులు



సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రజలు

## శాంతి సందేశం.. ప్రపంచానికి ఆదర్శం




పర్లాకిమిడి: శాంతిసందేశ యాత్రలో బ్రహ్మకుమారీలు



ప్రసంగిస్తున్న ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి



భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సదాశివ ప్రదాన్ దంపతులు

కొరాపుట్: బ్రహ్మకుమారీల శాంతి సందేశం ప్రపంచానికి ఆదర్శమని రాష్ట్ర స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్‌కుమార్ మాఝి అన్నారు. నవరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి బి.మాలిగుడ గ్రామంలో ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారి కేంద్రంలో నూతనంగా నిర్మించిన సద్భావనా సమావేశ మందిరం ప్రారంభోత్సవానికి ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సామాజిక అభ్యుదయం కోసం బ్రహ్మకుమారీలు ఎంతో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కుటుంబ వ్యవస్థను వదలి సమాజం కోసం పాటు పడుతున్నారని ప్రశంసించారు. అంతకుముందు నూతన భవనాన్ని నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ దంపతులు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి కులదీప్ తదితరులు పాల్గొన్నారు.

**శాంతి ర్యాలీ..**

పర్లాకిమిడి: మహా శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, ఓంశాంతి కాలనీ నుంచి ఫారెస్ట్ గేటు వరకు బ్రహ్మకుమారీలు శాంతి సందేశ ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం ఇందిరానగర్ వద్ద నిర్మించిన నూతన ప్రజాపిత బ్రహ్మకుమారీ శాంతి భవనాన్ని మాలా దీదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు శాంతిధూతల వేషాధారణతో జాజిపురం వరకు ఊరేగింపు చేపట్టారు.

## కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



ఆకట్టుకుంటున్న చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

బరంపురం: నగరంలోని డైమండ్ ట్యాంక్ రోడ్డు ప్రాంగణంలో ఉన్న పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయ 53వ వార్షికోత్సవం భాగంగా చేపట్టిన నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు, అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఇందులో తెలుగు కళా, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో మల్లేశ్వర నృత్య నికేతన్ బృందం చేపట్టిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా నాట్య గురువు బి.శివప్రసాద్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కారించి, జ్ఞాపికలు అందజేశారు.



నాట్య గురువు శివప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

## ఎన్‌సీసీ అకాడమీ పనుల పరిశీలన



కలెక్టర్ అబ్దుల్ అక్తార్‌తో కల్నల్ సాగర్

జయపురం: స్థానిక పట్టణంలో నిర్మిస్తున్న ఎన్‌సీసీ అకాడమీ, గ్రూప్ ప్రధాన కార్యాలయ పనులను ఎన్‌సీసీ డైరెక్టర్ కల్నల్ సాగర మహంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయపురంలో నిర్మిస్తున్న కార్యాలయం రాష్ట్రంలో నాల్గవ కేంద్రంగా తెలిపారు. జనవరి నాటికే పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. అవసరమైనంత స్థలం లభించక పోవడంతో జాప్యమైనట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పారాబెడ లో ని కోవిడ్ కేర్ సెంటర్ ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయంగా మార్పు చేస్తున్నట్లు వెల్లడించారు. యుద్ధ ప్రాతిపదిన నిర్మాణాలు పూర్తి చేసి, మార్చి 15నాటికి ప్రారంభోత్సవానికి యోచిస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని గ్రూప్ అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు అవసరమైన వసతులు, శిక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అక్తార్‌ను కలిసి, పనుల్లో సహకారం అందించాలని కోరారు. ఎన్‌సీసీ క్యాడెట్ల వైద్యానికి తగిన వైద్య సదుపాయం కేటాయించాలని తెలిపారు. బీఎస్ఎఫ్, కోబ్రా బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ జవాన్ల ప్రయోజనాలకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కె.శ్రీనివాస్, యూనిట్ హెడ్ నవీన్ ఘోష్, ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్ల సంఘ కార్యదర్శి నిషాన్ పట్నాయక్, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ పాఢి తదితరులు పాల్గొన్నారు.

## కొరాపుట్‌లో టీడీకోల్ డైరెక్టర్లు ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన ఈశ్వర్‌బాగ్



రామకృష్ణ బిసోయి

కొరాపుట్: గిరిజనాభివృద్ధి సహకార సంస్థ ఒడిశా లిమిటెడ్(టిడికోల్) ఎన్నికలో కొరాపుట్ జిల్లా స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన జిల్లాల్లో 21 డైరెక్టర్లకు గాను ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగా, వీటికి ఈనెల 26న పోలింగ్ జరగనుంది. కొరాపుట్ జిల్లాలో రెండు స్థానాలకు గాను అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపసంహరణ గడువు శనివారం ముగిసింది. కేవలం ఒక్కో అభ్యర్థి మాత్రమే పత్రాలు అందించడంతో జిల్లాకు చెందిన రామకృష్ణ, ఈశ్వర్ బాగ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. వీరిద్దరూ బీజేడీ కార్యకర్తలు. అధికార పార్టీ తరపున గెలుపు బాధ్యతలను కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహికి అధిష్టానం అప్పగించింది. మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్ జిల్లాలో ఒక్కో స్థానానికి ఎన్నిక జరగనుండగా, వీటికి పోలింగ్ 26న నిర్వహించనున్నారు.

## హర్యాణా పర్యటనకు గిరిజన యువత



హర్యాణా పర్యటనకు ఎంపికైన గిరిజన యువతతో బీఎస్ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని బీఎస్ఎఫ్ రెండో బెటాలియన్ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాలకు చెందిన 34మంది గిరిజన యువతీ, యువకులను హర్యాణా పర్యటనకు ఎంపికచేశారు. యాత్రలో భాగంగా వీరంతా ఈనెల 15 నుంచి 21వరకు హర్యాణాలోని పర్యాటక, చారిత్రకు ప్రదేశాల సందర్శనతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులను కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కామాండెంట్ అమిత్ ప్రసాద్ మాట్లాడుతూ మల్కన్‌గిరి జిల్లాలో అనేక గిరిజన తెగలు ఉన్నాయని తెలిపారు. వారికి బాహ్య ప్రపంచంపై అంతగా అవగాహన లేకపోవడంతో మావోయిస్టుల వ్యూహాలకు బలవుతున్నారని అభిప్రాయం వ్యక్తంచేశారు. వారి లో చైతన్య తీసుకు వచ్చేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు జిల్లా నుంచి 205మంది గిరిజన యువతీ, యువకులను అహ్మదాబాద్, బెంగలూర్, న్యూఢిల్లీ, చండీఘర్, భోపాల్, కొచ్చి తదితర ప్రాంతాల పర్యటనకు తీసుకు వెళ్లామన్నారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పిస్తామని వివరించారు. కార్యక్రమలో బీఎస్ఎఫ్ అధికారి ఏకే సింగ్, జిల్లా నెహ్రూ యువకేంద్రం అధ్యక్షుడు హరీష్ రూపాల్ జవాన్లు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అనుకుల్ బాబా జయంత్యుత్సవం

పర్లాకిమిడి: కిమిడి–పాతపట్నం రోడ్డులోని మహేంద్రతనయ నది వద్ద ఉన్న సత్సంగ్ ప్రార్థనా మందిరంలో ఠాకూర్ అనుకుల్‌చంద్ర బాబా 135 జయంతి ఉత్సవాలు, 16వ ప్రతిష్ఠాదినోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి పురవీధుల్లో భక్తులు ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రార్థనా స్థలంలో అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా మందిరం ప్రతినిధులు మాట్లాడుతూ.. బాబా ఠాకూర్ 1888 బంగ్లాదేశ్‌లోని పబ్నా జిల్లా హిమాయత్‌పూర్‌లో జన్మించారని, 1949లో బీహార్‌లో స్థిరపడ్డారని తెలిపారు. 1969లో బ్రహ్మసమాధి అయిన తరువాత ఒడిశాలోని అనుగూల్, బీహార్ రాష్ట్రాల్లో ఆయన శిష్యులు అనేక విద్యాసంస్థలు స్థాపించారన్నారు. ఆయన జయంతి ఉత్సవాలను పర్లాకిమిడిలో ఏటా అత్యంత ఆడంబరంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ప్రతిష్ఠాదినోత్సవంలో భజనలు చేస్తున్న భక్తులు



మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

## క్లుప్తంగా

### ఎస్‌ఈబీ కానిస్టేబుల్ ప్రతిభ



సర్టిఫికెట్, మెడల్ అందుకుంటున్న జయరామ్‌నాయుడు

బొబ్బిలి: ఈనెల 10వ తేదీ నుంచి 12వరకు వెస్ట్‌బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి 42వ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ -2023లో బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కానిస్టేబుల్ పి.జయరామ్‌నాయుడు ప్రతిభ చాటి ద్వితీయస్థానం సాధించాడు. ఈ చాంపియన్ షిప్ 50ప్లస్ గ్రూప్‌లో 5కిలోమీటర్ల రేస్‌వాకింగ్ విభాగంలో ద్వితీయ స్థానం పొందాడు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన జయరామ్‌నాయుడుకు పతకం, సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందించారు. తమ కానిస్టేబుల్ జాతీయస్థాయిలో ప్రతిభసాధించడంతో ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

### ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న బస్సు ముందుభాగం

కొత్తవలస: మండల కేంద్రంలో గల ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం తెల్లవారు జామున ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం డిపోకు చెందిన బస్సు కొత్తవలస కాంప్లెక్స్‌లో నైట్ హాల్టు ఉంది. తెల్లవారు జామున మొదటి ట్రిప్‌లో కాంప్లెక్స్‌లోనుంచి బయటకు వస్తున్న సమయంలో విశాఖపట్నం నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ, బస్సు డ్రైవర్‌లకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది.

### బోల్తాపడిన చెరుకు ట్రాక్టర్

పాలకొండ రూరల్: పాలకొండ- వీరఘట్టం



ప్రధాన రహదారిపై బోల్తాపడిన చెరకు ట్రాక్టర్

రహదారిలోని నవగాం సమీపంలో చెరకు తరలిస్తున్న వాహనం అదుపుతప్పి ప్రధాన రహదారిపై ఆదివారం బోల్తాపడింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోయినా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది, ముఖ్యంగా జిల్లా కేంద్రానికి, ఒడిశా రాయగడకు వెళ్లే ఈ రహదారిలో వాహనం బోల్తా పడడంతో చెరకు రహదారిపై పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు కొంతసమయం అంతరాయం కలిగింది.

### రాహుల్‌గాంధీ నాయకత్వం బలపరచాలి

- డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్



కరపత్రాలు పంపిణీచేస్తున్న రమేష్‌కుమార్

నెల్లిమర్ల: రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో హాత్ సే హాత్ జోడో అభియాన్ (చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం) అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. దేశంలో సమర్థవంతమైన పాలన కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో కనకల పద్మనాభం, రామకృష్ణ, అప్పారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి గాయాలు

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం విద్యార్థి శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వసతిగృహంలో పడిపోవడంతో గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎస్.సుమన శనివారం రాత్రి డార్మిటరీలో మొబైల్ ఫోన్ చూసుకుంటూ నడవడం వల్ల ప్రమాదవశాత్తు కింద పడడడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గల కారణాలపై ప్రిన్సిపాల్ పి వెంకటనాయుడు దగ్గర ప్రస్తావించగా డార్మిటరీ వద్ద గాయాలపాలైన విద్యార్థిని సిబ్బంది సహకారంతో చికిత్స నిమిత్తం 108 లో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని చెప్పారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహరాజా ఆస్పత్రికి రిఫర్ చేశారని తెలియజేశారు. విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు వచ్చి దగ్గరుండి చూసుకుంటున్నారని తెలియజేశారు.

# అట్టహాసంగా ఆరాధనోత్సవాలు

- సెంచూరియన్ యూనివర్సిటీలో ఘంటసాల పాటల పోటీలు
- ఆకట్టుకున్న నృత్య, కళా ప్రదర్శనలు
- హాజరైన వర్సిటీ విజయనగరం వీసీ జీఎస్ఎన్ రాజు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఆరాధనోత్సవాలు ఆదివారం నిర్వహించారు. గజపతి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్నూరు రామకృష్ణ జ్యోతి వెలిగించి, కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ప్రారంభ గీతాన్ని గంటా నానాజీ ఆలపించారు. అనంతరం ఘంటసాల పాటల పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంతాలకు చెందని గాయనీ గాయకులు విచ్చేసి, ఘంటసాల గీతాలను పాడారు. సెంచూరియన్ వర్సిటీ(విజయనగరం) క్యాంపస్ ఉపకులపతి డాక్టర్ జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల నాలుగు దశాబ్దాల పాటు తెలుగు శ్రోతలను అలరించారన్నారు. అజరామరమైన 40వేల పాటలు పాడిన ఆయన వర్ధంతి సందర్భంగా ఆరాధనోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

**తెలుగు ఉన్నంత వరకు..**

ఒడిశాలో తెలుగు భాష ఉన్నంత వరకు పర్లాకిమిడిలో సాహితీ, సంస్కృతి కార్యాక్రమాలు నిర్వహిస్తామని చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి అధ్యక్షుడు పి.ఆనందరావు ప్రకటించారు. అనంతరం కళింగ వైశ్యసంఘం మహిళా సభ్యులు కోలాటం, హాస్య నాటికలు ప్రదర్శించారు. హిమగిరి బృందం కూచిపూడి, భరతనాట్యం అద్భుతంగా ప్రదర్శించి, ఆకట్టుకున్నారు. కళాకారులను వర్సిటీ వీసీ రాజు జ్ఞాపికలను అందజేసి, సత్కరించారు. పాతపట్నంకు చెందిన పెద్దింటి మోహన్‌దాస్ దుర్యోధన మయసభ ఏకపాత్రాభినయం, పార్వతీరానిక చెందిన కె.మంగాదేవి హరిశ్చంద్ర ఏకపాత్రాభినయం, కాటికాపరి సీన్ ప్రదర్శించి, ప్రేక్షకులను మెప్పించారు. కార్యక్రమంలో చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి కార్యదర్శి బర్నాల జనార్దనరావు, సలహాదారు వీఎస్ఎన్ రాజు, ఈసై వెంకట్రావు, వీవీ రమణమూర్తి పంతులు, పోలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.





ఘంటసాలకు నివాళులర్పిస్తున్న ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, చైతన్య సమితి ప్రతినిధులు



హిమగిరి బృందం కూచిపూడి నృత్యం



పెద్దింటి మోహన్‌దాస్ ఏకపాత్రాభినయం



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న ఆంధ్రా గాయకులు



మాట్లాడుతున్న వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు, నిర్వహకులు

## షూటింగ్ బాల్ పోటీల్లో బాలికల జట్టు సత్తా



ప్రథమస్థానం సాధించిన విజేతలకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

రాజాం సిటీ: షూటింగ్ బాల్ పోటీల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లా బాపులపాడులో ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో బాలికలు సత్తా చాటారని ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఫైనల్‌లో నెల్లూరు జట్టుపై శ్రీకాకుళం జట్టు పైచేయి సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. జిల్లా జట్టు సభ్యుల్లో వంగర మండలం మడ్డువలస, సంతకవిటి మండలం మండాకురిటి, సంతకవిటి, రేగిడి మండలం కందిశ, రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు టెక్కలి మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థినులు ఉన్నారు.ఈ జట్టులో ఎక్కువగా రాజాం నియోజక వర్గానికి చెందిన విద్యార్థినులే ఉన్నారు. ఈ సందర్భంగా బాలికల విజయంపట్ల జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందనాయుడుతోపాటు పలువురు అభినందించారు.

## ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఓ మహిళ ఆటో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండుగులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారైన కేసులో టూటౌన్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖకు చెందిన నల్లపురాజు పద్మావతి దేవి జనవరి 15న పూల్‌బాగ్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు అయ్యప్పనగర్ జంక్షన్‌లో ఆటోదిగి నడుచుకుంటూ వెళ్తోంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు లంకవీధి జంక్షన్ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్ వెనక్కి తిప్పి పారిపోతున్న విశాఖకు చెందిన బొండా అరుణకుమార్, కనగంటి డానియల్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిందితులు నేరం అంగీకరించారు. నిందితుల నుంచి మోటార్ సైకిల్‌ను సీజ్ చేశారు. బంగారాన్ని కరిగించి విశాఖ అట్టికా గోల్డ్‌షాప్‌లో అమ్మినట్లు నిందితులు అంగీకరించడంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్సై, పైడితల్లి, టీమ్‌ను సీఐ అభినందించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతిచెందిన గణేష్

శృంగవరపుకోట: ఇటీవల పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన పట్టణానికి చెందిన యువకుడు వారాది గణేష్(28) విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. స్థానిక గొల్లవీధిలో నివాసం ఉంటున్న గణేష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో కుటుంబాన్ని వదిలేస్తున్నావని భార్య నాగమణి మందలించడంతో మనస్తాపం చెంది ఈనెల 10వ తేదీన పురుగు మందు తాగాడు. దీంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

## గిరిజనుడికి రూ.25వేల సాయం



గిరిజనుడికి రూ.25వేలు ఇస్తున్న ధ్యానం నాన్న బిడ్డలు

శృంగవరపుకోట: చనిపోయిన భార్య మృతదేహాన్ని తన భుజంపై మోసుకెళ్లిన గిరిజనుడి పరిస్థితికి తల్లడిల్లిన ఎస్.కోట రాజీపేట గ్రామంలో గల శంబల నగరి నిర్వాహకులు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. రాజీపేట నుంచి మౌనగా యత్రి తపస్వి ధ్యానం నాన్న బిడ్డలు మురళి, కిశోర్, సత్తిబాబు, అప్పారావులు 125కి.మీ దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా మిర్తిపాడు సమితిలో పొట్టంగి గ్రామానికి వెళ్లి గిరిజనుడు సోములుకు రూ.25వేలు అందజేశారు. ఒడిశాకు చెందిన ఈడ సోములు తన భార్య సాములుకు ఆరోగ్యం బాగులేకపోవడంతో విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకుపొమ్మని వైద్యులు చెప్పారు. దీంతో భార్యను ఆటోలో తీసుకుని విజయనగరం వెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె మరణించడంతో ఆటో డ్రైవర్ అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయాడు. అనంతరం దిక్కుతోచని స్థితిలో భార్య మృతదేహాన్ని భుజాన వేసుకుని నడుస్తున్న సోములును చూసిన విజయనగరం ఎస్సై తిరుపతిరావు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఇంటికి పంపారు. ఈ ఘటనతో కలత చెందిన శంబలనగరి ఆశ్రమ వ్యవస్థాపకులు ధ్యానం నాన్న తన బిడ్డలతో గిరిజనకుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు.

### మహాశివరాత్రికి పారమ్మకొండపై ఏర్పాట్లు



కొండపైకి తరలిస్తున్న వాటర్‌ప్యాకెట్ల బస్తాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని పారమ్మకొండ వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా కొండమీదకు తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.మార్గమధ్యంలో భక్తులకు వాటర్‌ప్యాకెట్లు ద్వారా నీటిని అందించనున్నట్లు ఈఓ ప్రసాదరావు తెలిపారు. వేలాది సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### రెండు పూరిళ్లు దగ్ధం



దగ్ధమైన పూరిళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాచిపెంట: మండలంలోని మోసూరు గ్రామంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యామల పోలినాయుడు పూరింటిలో శనివారం రాత్రి అకస్మికంగా మంటలు వ్యాపించాయి. మంటలు అదుపుచేసేలోపు పక్కన ఉన్న కట్టపల్లి సుశీలకు చెందిన పూరింటికి కూడా అంటుకోవడంతో రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి, ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల ఆస్తినష్టం జరిగినట్లు ప్రమాద స్థలాన్ని సందర్శించిన రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

### మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

పార్వతీపురం టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు లేదా బాధ్యులైన వాహన యజమానిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో నమోదవుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మైనర్ల డ్రైవింగ్ వల్లే చోటు చేసుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. మైనర్ల డ్రైవింగ్ మార్గదర్శకాలను విడుదల చేశారు. విద్యార్థులు, మైనర్లు బైక్‌లు, కార్లు నడపడం చట్ట విరుద్ధమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు తల్లిదండ్రులు బైకులు, కార్లు ఇవ్వకూడదని సూచించారు. ప్రమాదాల్లో మైనర్లకు గాయాలైనా.. చనిపోయినా ఇందుకు బాధ్యులుగా వాహనం ఇచ్చిన వారిని గుర్తిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## గిరిజనుడికి రూ.25వేల సాయం



గిరిజనుడికి రూ.25వేలు ఇస్తున్న ధ్యానం నాన్న బిడ్డలు

శృంగవరపుకోట: చనిపోయిన భార్య మృతదేహాన్ని తన భుజంపై మోసుకెళ్లిన గిరిజనుడి పరిస్థితికి తల్లడిల్లిన ఎస్.కోట రాజీపేట గ్రామంలో గల శంబల నగరి నిర్వాహకులు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. రాజీపేట నుంచి మౌనగా యత్రి తపస్వి ధ్యానం నాన్న బిడ్డలు మురళి, కిశోర్, సత్తిబాబు, అప్పారావులు 125కి.మీ దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా మిర్తిపాడు సమితిలో పొట్టంగి గ్రామానికి వెళ్లి గిరిజనుడు సోములుకు రూ.25వేలు అందజేశారు. ఒడిశాకు చెందిన ఈడ సోములు తన భార్య సాములుకు ఆరోగ్యం బాగులేకపోవడంతో విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకుపొమ్మని వైద్యులు చెప్పారు. దీంతో భార్యను ఆటోలో తీసుకుని విజయనగరం వెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె మరణించడంతో ఆటో డ్రైవర్ అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయాడు. అనంతరం దిక్కుతోచని స్థితిలో భార్య మృతదేహాన్ని భుజాన వేసుకుని నడుస్తున్న సోములును చూసిన విజయనగరం ఎస్సై తిరుపతిరావు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఇంటికి పంపారు. ఈ ఘటనతో కలత చెందిన శంబలనగరి ఆశ్రమ వ్యవస్థాపకులు ధ్యానం నాన్న తన బిడ్డలతో గిరిజనకుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు.

## చైతన్య ప్రతీకలు నాటికలు



నాన్నా, నేనొచ్చేస్తా..నాటికలో సన్నివేశం

- రెండోరోజు ఆకట్టుకున్న ప్రదర్శనలు

విజయనగరం టౌన్: నాటికలు చైతన్య ప్రతీకలని ప్రముఖ సాహితీవేత్త నాలుగెస్సుల రాజు పేర్కొన్నారు. నాటకశాల, అభినయ సంస్థ సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ నిర్వహిస్తున్న 7వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలలో భాగంగా రెండోరోజు గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న మంచి చెడులను కళ్లకు కట్టినట్లు చూపించే నాటికలు నేడు కనుమరుగయ్యాయన్నారు. పాశ్చాత్య పోకడలు విజృంభిస్తున్న నేటితరుణంలో ఇటువంటి సంస్థలు తమ నటనా ప్రదర్శనలతో సమాజానికి మంచి మెసెజ్ ఇవ్వడం ఎంతైనా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నడిపేన శ్రీనివాసరావు (జమ్ము శ్రీను), సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్, సభ్యులు ఎంఎస్ఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**ఆలోచింపజేసిన నాటికలు**

పల్నాడు జిల్లా, చిలకలూరి పేట అంజనా రాథోడ్ థియేటర్ ఆర్ఎస్ఆర్.నాయక్ దర్శకత్వంలో 'నాన్నా నేనొచ్చేస్తా'..నాటిక ఆద్యంతం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. తాళా బత్తుల వెంకటేశ్వరరావు రచనలో ఇతివృత్తం అద్భుతంగా కట్టిపడేసింది. సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు నుంచి పెళ్లి వరకూ అడిగిందల్లా కాదనకుండా ఇస్తారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకుని, పోనీలే మన పిల్లలేగా అని స్వేచ్ఛనిచ్చి పెంచితే దాని ఫలితం, పెళ్లైన కొంతకాలానికేవైవాహిక జీవితంలో భార్యా,భర్తల మధ్య వచ్చిన మనస్పర్థలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లంటే సర్దుబాటు, సంసారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేక మెట్టినింటి నుంచి పుట్టినింటికి 'నాన్నా... నేనొచ్చేస్తా..' అంటూ ప్రయాణం చేస్తున్న సుధ లాంటి అమ్మాయికి, భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు రాఘవ, సావిత్రిల మధ్య జరిగిన సంఘర్షణలకు దృశ్యరూపమే ఈ నాటిక సారాంశం, అనంతరం గుంటూరు శ్రీ సద్గురు కళా నిలయం ఆధ్వర్యంలో బసవరాజ్ జయశంకర్ దర్శకత్వంలో విద్యాధర్ మునిపల్లె రచనలో నిర్వహించిన 'కమనీయం' నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. జాతీయ వారసత్వ సంపద మన కళలు, మన చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యాధారాలు. కళాభిమానాన్ని భావితరాలకు అందించండని, ఏదైనా ఒక కళారూపాన్ని నేర్పించేందుకు ప్రోత్సహించడని, కళలను బతికించడం మన బాధ్యతని తెలియజేయడమే 'కమనీయం' నాటిక సారాంశం.

## క్లుప్తంగా

### ఆలయ ప్రహరీ నిర్మాణానికి విరాళం



నీలమణిదుర్గ ఆలయం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పూజారి కృష్ణారావు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మ వారి ఆలయం ప్రహరీ నిర్మాణానికి జలుమూరు మండలం గంగధరపేటకు చెందిన పూజారి కృష్ణారావు(ఐఆర్ఎస్), మనీషా దంపతులు, సర్పంచ్ గురుగుబెల్లి వెంకటరమణి, వెంకటరమణ దంపతులు ఆదివారం భూమి పూజ చేశారు. అలయ ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షల విరాళాన్ని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎస్.కృష్ణారావు, పద్మ నేతాజీ, గుమస్తా సుధాకర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



జిగురు పూసిన అట్టలతో రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయం సాగులో రాజీలేని సూత్రాలు పాటించి మెరుగైన పంట దిగుబడులు సాధించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. జరజాంలోని ప్రకృతి వ్యవసాయ రబీసాగును ఆదివారం పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. 15 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా జిగురు పూసిన అట్టలు (పసుపు పల్లేలు) వినియోగంపై అవగాహన కల్పించారు. వీటిని పొలంలో పెట్టటం వల్ల సుడిదోమ, చిన్న చిన్న పురుగులు, దోమలు అట్టలకు అంటుకొని మృతి చెందుతాయని తెలిపారు. తెగుళ్ల నుంచి పంటలకు రక్షణ లభిస్తుందని చెప్పారు. తెగుళ్ల ఉద్ధృతికి తగ్గట్లు కషాయాలు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బంది ధనుంజయ్, హరేరామ్, ఎర్రప్పడు పాల్గొన్నారు.

### పరీక్షతో సంబంధం లేకుండా రెగ్యులర్ చేయాలి



సమావేశంలో చర్చిస్తున్న వీఆర్ఓలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గత ఏడాది గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతి పొందిన వారికి ఎటువంటి సర్వే పరీక్షల నిబంధనలు లేకుండా సర్వీసు రెగ్యులర్ చేయాలని వీఆర్వోల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) మైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే పరీక్ష నిబంధనలు సడలించాలని కోరారు. వీఆర్ఏలుగా, వీఆర్ఓలుగా ఎంతో అనుభవం ఉన్నందున సర్వే పరీక్ష తప్పని సరి చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి సర్వీసును రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఓ సంఘం ప్రతినిధులు వై.ప్రవీణ్‌కుమార్, కె.వి.రాజేశ్వరరావు,ఆర్.ఆదినారాయణ, టి.రాములు, జి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

### మెట్ల పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

మందస: మండలంలోని సువర్ణాపురం పంచాయతీ గుడ్డిబద్ర గ్రామానికి చెందిన గేదెల కృష్ణారావు(46) మెట్ల పైనుంచి జారిపడి మృతి చెందాడు. కృష్ణారావు ఈ నెల 11న ఉదయం మేడపై నుంచి దిగుతూ మెట్లపై ఒక్కసారిగా జారి పడ్డాడు. వెంటనే హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా అక్కడి నుంచి టెక్కలి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కృష్ణారావు ఆదివారం మృతి చెందాడు. మందస పోలీసు స్టేషన్ హెచ్‌సీ టి.వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సొంత ఊరికి కొంత మేలు

కాశీబుగ్గ: తల్లిదండ్రుల పేరు శాశ్వతంగా నిలిపోయేలా, సొంత ఊరికి పనికి వచ్చేలా కుమారులు ఓ మంచి పనిచేశారు. పలాస మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బమ్మిడి వైకుంఠరావు, బమ్మిడి మోహనరావులు తమ తల్లిదండ్రులు బమ్మిడి నారాయణ, వరలక్ష్మి దంపతుల పేరున రూ.7 లక్షలతో బస్టాప్ కట్టించారు. ఆదివారం ఈ బస్టాప్‌ను డాక్టర్ గుంట శాంతారావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో లఖినాన కిషోర్, రేణుకేశ్వరరావు, దామోదరరావులు పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో ప్రారంభించిన బస్టాప్‌లో మాట్లాడుతున్న అతిథులు

### విష్ణుమూర్తికి కిరణ స్పర్శ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని క్షేత్రపాలకుడు శ్రీ మహావిష్ణువు విగ్రహాన్ని ఆదివారం ఉదయం సూర్య కిరణాలు అభిషేకించాయి. రెండు నిమిషాల పాటు జరిగిన ఈ కిరణ స్పర్శను భక్తులు తన్మయత్వంతో తిలకించారు. వారం పాటు ఈ కిరణ స్పర్శ ఉంటుందని అర్చకులు చెబుతున్నారు.



### ● హరోం హర

శివరాత్రి ఉత్సవాలకు శ్రీముఖలింగం ముస్తాబవుతోంది. ఏర్పాట్లలో భాగంగా ఆలయంలో బారికేడ్లు, క్యూలు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి తెలిపారు. ఆలయంలో ఆరు సీసీ కెమెరాలు ఉండగా అదనంగా ఇంకొన్ని ఏర్పాట్లు చేయనున్నారు.

– జలుమూరు



### ● చూడండి కనులారా..



మందసలోని వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఉత్సవాల్లో మూడో రోజు ఆదివారం దేవతాహ్వానం పలికారు. అలాగే ధ్వజారోహనం చేశారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. – మందస

### ● 20 కేజీల ఆనపకాయ

లఖందిడ్డి గ్రామానికి చెందిన రైతు కర్రి అప్పారావు పొలంలో పండిన ఆనపకాయ 20 కేజీల వరకు బరువు పెరిగింది. సాధారణంగా ఆనపకాయ 5 కేజీలకు మించి బరువు పెరగదు. ఇక్కడ మాత్రం భారీగా ఉండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, పుష్కలంగా నీరు అందడం వల్ల బరువైన ఆనపకాయలు కాస్తాయని అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయికిరణ్ తెలిపారు.

- కోటబొమ్మాళి



# ఏసీ టు డీసీ

- ఏసీ నుంచి డీసీ హోదాకు పెరగనున్న అరసవల్లి సూర్యక్షేత్రం స్థాయి
- ఇప్పటికే డీసీ క్యాడర్ స్థాయిలో ట్రస్ట్ బోర్డు నియమకాలు
- త్వరలోనే మార్గదర్శకాలు



అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుని ఆలయం దినదిన ప్రవర్ధమానంగా ప్రజ్వరిల్లుతోంది. ఈ క్షేత్రం ఇప్పటి వరకు వార్షికాదాయాల ప్రకారం అసిస్టెంట్ కమిషనర్ (ఎ.సి) క్యాడర్ హోదాలో ఉంది. ఇకమీదట డిప్యూటీ కమిషనర్(డీసీ) క్యాడర్ హోదా పొందేలా మార్గదర్శకాలు రానున్నాయి. ఈ మేరకు అడుగులు పడుతున్నాయి. ఆలయాల వార్షికాదాయం వరుసగా మూడేళ్ల పాటు రూ.5కోట్లకు పైగా వస్తే స్థాయి పెంపుపై దేవదాయ శాఖ నిర్ణయం తీసుకుంటుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఉన్నతాధికారుల సమీక్షలో స్థాయి పెంపు వర్తింపు అనే జాబితాలో అరసవల్లికి చోటుదక్కింది. ఈ మేరకు త్వరలోనే అరసవల్లి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా అధికారి కార్యనిర్వహణాధికారిగా రానున్నారు.

**కీలక నిర్ణయాలు..**

అరసవల్లి ఆలయానికి ఐదేళ్ల నుంచి ఆదాయంలో భారీ పెంపు కనిపిస్తోంది. కానీ అప్పట్లో ఆలయ అభివృద్ధిని ప క్కన పెట్టేశారు. స్థాయి పెంపు ఊసే లేకుండా చేశారు. అయితే



ప్రస్తుత ప్రభుత్వం అరసవల్లి ఆ లయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌కు రంగం సిద్ధం చేస్తూనే.. మరో వైపు పలు కీలక నిర్ణయాలను అమలు చేసింది. అరసవల్లిలో ప్రధాన ఉత్సవంగా ఉన్న రథసప్తమి నాడు ఉత్సవ ప్రధాన అధికారి(సీఎఫ్ఓ)గా ఈ ఏడాది ఏకంగా దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌ను నియమించారు. ఇదే గతంలో డిప్యూటీ కమిషనర్ మాత్రమే సీఎఫ్ఓగా వ్యవహరించేవారు. అలాగే ఇప్పటివరకు అరసవల్లిలో ఇటీవల కాలంలో రెండు సార్లు అమలైన ట్రస్ట్ బోర్డు (పాలకమండలి)లో కూడా మొత్తం 10 మంది సభ్యులే ఉండేవారు. కానీ తాజాగా ప్రభుత్వం ప్రకటించిన అరసవల్లి పాలకమండలిలో డీసీ క్యాడర్ ఆలయాల్లో ఉన్నట్టుగానే మొత్తం 12 మంది సభ్యులతో కూడిన బోర్డును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలంలో వరుసగా తీసుకున్న ఈ రెండు నిర్ణయాలతో త్వరలోనే అరసవల్లికి డీసీ హోదా తథ్యమనే భావన ఆలయ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఇలా హోదా మారితే ఇక్కడ పనిచేస్తున్న ఆలయ ఉద్యోగుల జీతభత్యాలతో పాటు పింఛను సౌకర్యం కూడా తోడవుతుంది. స్వామిని దర్శించుకునే వారి సంఖ్య సైతం క్రమేపీ పెరుగుతోంది.

### గత వార్షిక లెక్కలు ఇలా..

అరసవల్లి ఆలయంలో వివిధ దర్శన టిక్కెట్లు, ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాలు, హుండీ కానుకలు, లీజులు, అద్దెలు, టెండర్లు తదితర మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఈ లెక్కన భక్తుల దర్శనాలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయం కూడా రూ.కోట్లతో పెరుగుతోంది. గత వార్షికాదాయ లెక్కలు పరిశీలిస్తే...

| ఆర్థిక సంవత్సరం | ఆదాయం (రూ. కోట్లలో) |
|---|---|
| 2018-19 | 5,96,12,010 |
| 2019-20 | 7,42,27,910 |
| 2020-21 (కరోనా కాలంలో) | 2,41,69,003 |
| 2021-22 | 6,61,68,426 |
| 2022-23 (జనవరి వరకు) | 8 కోట్లు (అంచనా లెక్కలు) |

### స్థాయి పెంపునకు అవకాశాలు



అరసవల్లి సూర్యదేవాలయంలో నిత్యం భక్తుల తాకిడి కనిపిస్తోంది. దేశ, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు ఎందరో దర్శనాలు చేసుకుని, ఇక్కడ సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్నారు. ఆరోగ్యం కోసం ఈ క్షేత్రానికి రోజురోజుకీ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే గతంలో కంటే భక్తులకు సౌకర్యాలు పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. నిత్యం ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ, అన్నదానం తదితరాలను అందజేస్తున్నాం. భక్తుల్లో సంతృప్తి శాతం పెంచేలా కృషి చేస్తున్నాం. ఈ ప్రభావంతో ఆలయ ఆదాయం ఏడాదికి ఏడాదికి పెరుగుతోంది. దీంతో ఆలయానికి డిప్యూటీ కమిషనర్ స్థాయి ఆలయంగా ఉత్తర్వులు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

## ఆదిత్యుని సన్నిధిలో మాఘసందడి



ఆలయ అనివెట్టి మండపంలో సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

- అరసవల్లికి పోటెత్తిన భక్తులు
- ఒక్క రోజులో ఆదాయం రూ.14.75 లక్షలు

అరసవల్లి: పవిత్ర మాఘ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. వేకువజామునే సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు.. స్థానిక ఇంద్రపుష్కరిణి వద్ద పిడకల పొయ్యిలో క్షీరాన్నం వండి ఆదిత్యునికి భోగం సమర్పించారు. ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలను భక్తులు చేయించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ, విశేష అర్చనలు చేశారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం, వేద పారాయణుల మధ్య ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీసూర్యనారాయణ స్వామికి విశేష అర్చనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం సమయంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలతో పుష్కరిణి నుంచి రూ.100 దర్శన మార్గం వరకు టెంట్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. చిన్నారులు, వృద్ధులతో వచ్చిన వారు ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకుని, సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. తాజాగా ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఎంపికైన మండవల్లి రవి, నెమలిపురి కోటేశ్వర చౌదరిలు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనివెట్టి మండపంలో లోక కల్యాణార్థం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు.



పిడకల పొయ్యిపై పరమాన్నం వండుతున్న మహిళలు



**భారీగా ఆదాయం..**

మాఘ ఆదివారం సందర్భంగా భక్తులు పోటెత్తడంతో ఒక్క రోజులో రూ.14,75,800 వరకు ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాలతో రూ.9,73,800, విరాళాల రూపంలో రూ.1,82 లక్షలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 3.20 లక్షల మేరకు ఆదాయం సమకూరిందని వివరించారు.

## ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.జగన్నాథం



వ్యవస్థాపక సభ్యులను సన్మానం చేస్తున్న సంఘం ప్రతినిధులు

పలాస: ప్రజాస్వామిక హక్కుల కోసం బలంగా నిలబడటమే నేడు బొడ్డపాడు యువజన సంఘం ఆవశ్యకతని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.జగన్నాథం అన్నారు. 1954లో ఏర్పడిన ప్పటి బొడ్డపాడు యువజన సంఘం కర్తవ్యాలు వేరన్నారు. దేశంలో ఇప్పుడా పరిస్థితులు లేవని చెప్పారు. భూమి కోసం, భుక్తికోసం ప్రజల విముక్తి కోసం ఒక ఎజెండాగా పెట్టుకొని ఆనాడు కమ్యూనిస్టు పార్టీలు పనిచేసిన కాలంలో ఈ సంఘం పుట్టిందని, ఎంతోమంది సభ్యులు కమ్యూనిస్టులుగా, విప్లవకారులుగా ఎదిగి ప్రజల కోసం పోరాడి ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. వారి బాటల్లో నడవాలని, ఆ కర్తవ్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం బొడ్డపాడు యువజన సంఘం 69వ వార్షికోత్సవం నిర్వహించారు. ముందుగా యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి యువజన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అమర వీరుల బంధుమిత్రుల కమిటీ నాయకురాలు మద్దు ధనలక్ష్మి కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో బొడ్డపాడు యువజన సంఘం వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న రెయ్యి పోలారావు, బచ్చల సూర్యనారాయణ, బత్తిన కృష్ణమూర్తి, బొడ్డు అప్పారావు, గేదెల గెడ్డయ్య, తామాడ గుర్రయ్య, గేదెల అప్పారావులను ఘనంగా సన్మానం చేశారు. తామాడ క్రాంతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కె.వి.జగన్నాథం మాట్లాడుతూ కేంద్రంలోని బి.జె.పి అనుసరిస్తున్న విధానాల వల్ల మాట్లాడే హక్కు లేకుండా పోతుందని, మత భావాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి పెను ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకుడు దున్న గోవిందరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, పోతనపల్లి కుసుమ, సాలిన వీరాస్వామి, పుచ్చ దుర్యోధనరావు, జోగి కోదండరావు, రాజాం గుణవంతు, కిక్కర డిల్లీరావు,బొడ్డపాడు యువజన సంఘం కార్యవర్గం సభ్యులు తదితరులు మాట్లాడి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. బొడ్డపాడు యువజన సంఘం మొదటి అధ్యక్షుడు తామాడ గణపతి శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, అతనితో పాటు ఆ నాడు 11మంది విద్యావంతులు అమరులయ్యారని, వారందరికీ జోహార్లు అర్పించారు.

### వాలీబాల్ పోటీల విజేతలుగా సిక్కోలు పశువైద్యులు



విజేతలను అభినందిస్తున్న జేడీ, డీడీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వరల్డ్ వెటర్నరీ డే సందర్భంగా విజయనగరంలో జరిగిన అంతర్‌జిల్లాల పశువైద్యుల టోర్నమెంట్‌లో వాలీబాల్ విభాగంలో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచినట్లు వెటర్నరీ జేడీ ఎం.కిషోర్‌కుమార్ ఆదివారం తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. జిల్లా జట్లను జేడీతో పాటు డీడీ ఎం.జగన్నాథం, టి.పి.మనోజ్‌కుమార్ అభినందించారు.

## సత్ఫలితాలిస్తున్న ‘స్టాంపింగ్’

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా గుడ్ల పంపిణీ
- చెరగడానికి వీలు లేని విధంగా ముద్ర
- పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు సరఫరా
- 2,08,550 మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రయోజనం



అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు తింటున్న చిన్నారులు

| | |
|---|---|
| ఐసీడీఎస్ ప్రాజెక్టులు | 17 |
| అంగన్‌వాడీ కేంద్రాలు | 3358 |
| మెయిన్ కేంద్రాలు | 2759 |
| మినీ కేంద్రాలు | 599 |
| గర్భిణులు | 22215 |
| బాలింతలు | 18325 |
| ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు | 1,12,548 |
| మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు | 55462 |

వజ్రపుకొత్తూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద కోడిగుడ్లు సరఫరా చేసే కార్యక్రమం సజావుగా సాగుతోంది. స్టాంపింగ్ విధానంతో అవినీతికి తావులేకుండా, గుడ్లు పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు చేరుతున్నాయి. గతంలో హాజరుశాతం పెంచి ఎక్కువగా గుడ్లు తెప్పించడం, మధ్యలోనే దారి మళ్లించి మార్కెట్‌లో అమ్మేయడం వంటి ఆరోపణలు వచ్చేవి. వీటన్నింటికీ చెక్‌పెడుతూ ప్రభుత్వం స్టాంపింగ్ విధానం తీసుకురావడం సత్ఫలితాలనిస్తోంది.

**ఇదీ సంగతి..**

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలు, ఆరు నెల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు, 3 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ప్రతి నెలా సుమారు 25 గుడ్లను వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ఆరు నెలలు నుంచి మూడేళ్ల లోపు ప్రతి 15 రోజులకోసారి ఇంటికి గుడ్లు అందిస్తున్నారు. మిగిలిన వారందరికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉడకబెట్టి పంపిణీ చేస్తారు. వీటిలో నాలుగు నుంచి ఆరు శాతం దారి మళ్లడం, పాడైపోవడం జరుగుతుండేది. దీనిని నివారించేందుకు నెలను మూడు భాగాలుగా విభజించి మొదటి పదిరోజులు సరఫరా చేసే గుడ్లపై ఒక రంగు, తర్వాత పది రోజులకు మరో రంగు, మిగిలిన పది రోజులకు వేరే రంగు చుక్కలు పెట్టి పంపిణీ చేసేది. అయితే అక్రమార్కులు ఐదు– పది నిమిషాల పాటు కోడిగుడ్లును నీళ్లలో నానబెట్టి గుడ్డుపై ముద్రించిన గుర్తులను తుడిచేసి చెరిపేసేవారు. దీంతో ప్రభుత్వం సరికొత్తగా కలర్ కోడింగ్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. బ్లూ, పింక్, గ్రీన్( బీపీజీ) రంగుల్లో గుడ్లు సరఫరాను ఆరంభించింది. మొదటి 10 రోజులు బ్లూ కలర్ కోడింగ్, తరువాత 10 రోజులు పింక్, మిగిలిన 10 రోజులు పాటు ఆకుపచ్చ రంగు కోడింగ్‌తో గుడ్లు అందించేవారు. కలర్ కోడింగ్ వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లను బయట అమ్మే వీలుండేది కాదు. ఒక వేళ అమ్మినా అవి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసినవని గుర్తించే వీలుంది. ఫలితంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరేది.

**స్టాంపింగ్‌తో సత్ఫలితాలు..**

ఈ పరిస్థితులను పూర్తిస్థాయిలో చక్కదిద్దే లక్ష్యంతో గుర్తు చెరిగిపోని విధంగా కోడిగుడ్డుపై స్టాంప్ చేసే విధానం తీసుకువచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో అమలు చేస్తున్న ఈ విధానం క్షేత్ర స్థాయిలో మంచి ఫలితాలే ఇస్తోందని అధికార యంత్రాంగాలు గుర్తించాయి. తాజాగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో చెరిపేసినా చెరగని ఓ స్టాంపును గుడ్డుపై వేస్తోంది. ఈ గుర్తు కారణంగా మార్కెట్‌లో అంగన్‌వాడీ గుడ్లను దొడ్డిదారిన అమ్ముకునే అవకాశం ఉండడం లేదు.

**అక్రమాలకు ఆస్కారం ఉండదు..**



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి లబ్ధిదారుకూ గుడ్డు అందించాలని ఆదేశించాం. ప్రతి పది రోజులకు ఒక రంగుతో కూడిన గుడ్లను సరఫరా చేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ముద్రతో గుడ్లు సరఫరా చేయడం వల్ల అక్రమాలకు అవకాశం లేదు.

– డి.శార్వాణి, ఐసీడీఎస్ సీడీపీఓ, కాశీబుగ్గ

**నిల్వ గుడ్లు గుర్తించే అవకాశం..**



అంగన్‌వాడీ కేంద్రాలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అందించే గుడ్లకు మూడు రంగుల్లో కలర్ కోడింగ్ ఇవ్వడం శుభ పరిణామం. తద్వారా గుడ్లు దుర్వినియోగం కావు. నిల్వ గుడ్లు ఐతే కలర్‌ను బట్టి గుర్తించే అవకాశం ఉంటుంది.

– వి.గీత, అంగన్‌వాడీ కార్యకర్త, మంచినీళ్లపేట

### ఆటో బోల్తా: బాలిక మృతి

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద ఆదివారం కారు ఢీకొని ఆటో బోల్తా పడిన ఘటనలో కరగాన ఢిల్లీశ్వరి(7) మృతి చెందింది. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండ లంలోని వెల్చురాయి గ్రామం నుంచి స్వగ్రా మం కోటపాలెం వెళ్లేందుకు ఢిల్లీశ్వరి తన తాతయ్య తాతారావు, అమ్మమ్మ సీతమ్మతో కలిసి రణస్థలం వచ్చి ఆటో ఎక్కి కూర్చుంది. 3.50 సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి వచ్చిన ఒక కారు ఈ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టడంతో బండి బోల్తా పడింది. అప్పటికి ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా.. ఢిల్లీశ్వరి మాత్రమే గాయపడింది. హుటాహుటిన బాలికను రణస్థలం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ పాప చికిత్స పొందుతూ మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఢిల్లీశ్వరి తల్లిదండ్రులు అప్పారావు, నీలవేణిలు కోటపాలెంలో ఉంటున్నారు. వీళ్లకు ఒక బాబు కూడా ఉన్నాడు. ప్రమాదంపై జేఆర్ పురం ఎస్ఐ జి. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్

శ్రీకాకుళం అర్బన్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలను దర్శించే భక్తులు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం నుంచి వేర్వేరు ప్రాంతాల్లో గల శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశా మని శ్రీకాకుళం 1వ డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోగ ల స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో ఆదివారం ఆయ న విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీ ల్లో శ్రీకాకుళం 1, 2వ డిపోల నుంచి 30 ప్రత్యేక బస్సులు రణస్థలం – రామతీర్థాల మధ్య ఏర్పాటు చేశామన్నారు. అలాగే 17వ తేదీ శుక్రవారం ఉదయం10 గంటలకు శ్రీశైలంకు, 18వ తేదీ శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వత్సవలస, శ్రీముఖలింగం క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రజలు సద్వినియోగించుకోవా లని ఆయన కోరారు. రణస్థలం–రామతీర్థాల మధ్య బస్సు చార్జి రూ.30లుగా నిర్ణయించామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.